క్లుప్తంగా

ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్



గుంటూరు రూరల్: క్రీస్తుని జన్మదినం ప్రేమతోకూడిన రోజని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గం సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. బుధవారం క్రిస్మస్ పర్వదినం సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. క్రీస్తు తెలిపిన ప్రేమ, క్షమా గుణాలను ప్రతి ఒక్కరూ అలవరుచుకోవాలని సూచించారు.

సౌత్ జోన్ వాలీబాల్ టీంకు విజ్ఞాన్ నిరుల విద్యార్థిని ఎంపిక



గుంటూరు రూరల్: సౌత్‌జోన్ వాలీబాల్ జట్టుకు విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని నెక్కల మాలతీ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాధిక తెలిపారు. కాకినాడ జేఎన్‌టీయూ సౌత్‌జోన్ మహిళా వాలీబాల్ అంతర కళాశాల పోటీలలో ప్రతిభ చూపినట్లు చెప్పారు. మంగళవారం పెదపలకలూరు రోడ్డులోని కళాశాలలో విద్యార్థిని అభినందన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యార్థినులు చదువుతో పాటు క్రీడలలో కూడా రాణించటం తమకు గర్వంగా ఉందన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారిణి మాలతీని విజ్ఞాన్ విద్యా సంస్థల అధ్యక్షుడు డాక్టర్ లావు రత్తయ్య, ఉపాధ్యక్షుడు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, కళాశాల ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ జి.సంధ్య, ఫిజికల్ డైరెక్టర్ కిషోర్‌కుమార్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎ.హరీష్ అభినందనలు తెలిపారు.

పాత పొన్నూరులో రెవెన్యూ సదస్సు



పొన్నూరు: భూ సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తహసీల్దార్ మహమ్మద్ జియావుల్‌హక్ అన్నారు. మంగళవారం పట్టణంలోని పాత పొన్నూరులో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సభలో తహసీల్దార్ పాల్గొని ప్రజల నుంచి 59 అర్జీలు స్వీకరించారు. వాటిలో మ్యుటేషన్ 1, క్యాస్ట్ 1, ఎఫ్ లైన్ 5, 22 ఏపై 52 అర్జీలని స్వీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎండోమెంట్ ఏఓ రమేష్, సర్వేయర్ సత్యనారాయణ, ఆర్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన



గుంటూరు రూరల్: రైతులకు ప్రత్యామ్నాయ పంటలను గురించి అధిక దిగుబడులు వచ్చే పంటలను గురించి వివరించాలని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానం, ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకుడు డాక్టర్ జి.శివన్నారాయణ కోరారు. మంగళవారం మండలంలోని జొన్నలగడ్డ, నిడుముక్కల గ్రామాల్లో బాపట్ల వ్యవసాయ కళాశాల నుంచి వచ్చి శిక్షణలో ఉన్న రావెప్ విద్యార్థులను ఆయన కలిసి వారికి పలు సూచనలు చేశారు. గ్రామంలోని ప్రధాన పంటలు, పంటల యాజమాన్య విధానాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలని సూచించారు. అదేవిధంగా రైతులకు అధిక దిగుబడులు వచ్చే విధంగా ప్రత్యామ్నాయ పంటలను గురించి అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ ఎన్.వెంకటలక్ష్మి, బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణపై అవగాహన

పట్నంబజారు: హెల్మెట్ అవగాహనపై పోలీసు అధికారులు నిత్యం నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. ప్రజల్లో అవగాహన కల్పించే దిశగా నిత్యం ఓ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ వినూత్న రీతిలో ముందుకు సాగుతున్నారు. దానిలో భాగంగానే గుంటూరు వెస్ట్ ట్రాఫిక్ సీఐ సింగయ్య ఆధ్వర్యంలో ఎస్పీ కార్యాలయం వద్ద వినూత్న కార్యక్రమం చేపట్టారు. విఘ్నేశ్వర స్వామి అవతారంలో ఓ వ్యక్తి, యమ ధర్మరాజు వేషధారణలో మరో వ్యక్తి కలిసి ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులను నిలువరించి హెల్మెట్ ధరించిన వారికి విఘ్నేశ్వర స్వామి వేషధారణ ఉన్న వ్యక్తి ద్వారా ఆశీర్వాదం ఇప్పించారు. హెల్మెట్ లేని వ్యక్తులు యమధర్మరాజు వేషధారణలో ఉన్న వ్యక్తితో హెల్మెట్ లేకుంటే జరిగే పరిణామాలు వివరించారు. సీఐ సింగయ్య మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధారణ గురించి వివరించేందుకు పలు కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు.

లోక రక్షకుడికి స్వాగతం

- ఊరూరా క్రిస్మస్ కాంతులు
- విద్యుత్‌దీప కాంతుల్లో మెరిసిపోతున్న చర్చిలు, ప్రార్థనా మందిరాలు
- బంధు మిత్రుల రాకతో క్రైస్తవుల లోగిళ్లు కళకళ
- నేడు క్రిస్మస్ పర్వదినం



క్రీస్తు జన్మదిన విశిష్టతను తెలుపుతూ రావిపాటివారిపాలెం అమలోద్భవిమాత చర్చి ఎదుట విశ్వాసులు ఏర్పాటు చేసిన పశువుల పాక



చర్చి ఎదుట విద్యుత్ కాంతుల్లో క్రిస్మస్ ట్రీ

ప్రత్తిపాడు: క్రిస్మస్ వేడుకలకు ఊరూవాడా సిద్ధమయ్యింది. క్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని క్రైస్తవులు అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే పెద్ద పండుగ క్రిస్మస్. ఈ నేపథ్యంలో ఇప్పటికే గ్రామాలు క్రిస్మస్ శోభను సంతరించుకున్నాయి. స్థానికంగా ఉన్న చర్చిలు, ప్రార్థనా మందిరాలు ప్రత్యేక అలంకరణలతో ముస్తాబయ్యాయి. విద్యుత్ దీప కాంతులతో ధగధగ మెరిసిపోతున్నాయి. విశ్వాసులు గృహాల్లో క్రిస్మస్ ట్రీలు, శాంతాక్లాజ్‌లు, ఇంటి ముంగిట రంగురంగుల స్టార్‌లు ఏర్పాటు చేసి క్రీస్తు రాకను ఆహ్వానిస్తున్నారు. ఆయా గ్రామాల్లోని యువత, సంఘస్తులు ఇప్పటికే ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన పెద్ద పెద్ద స్టార్‌లు పండుగ వాతావరణాన్ని రెట్టింపు చేస్తున్నాయి.

అర్ధరాత్రి నుంచే ప్రత్యేక ప్రార్థనలు..

మంగళవారం అర్ధరాత్రి నుంచి చర్చిల్లో నిర్వహించనున్న ప్రత్యేక ప్రార్థనలకు చర్చిల ఫాదర్లు, పాస్టర్లు, సంఘపెద్దలు, సంఘస్తులు, విశ్వాసులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. స్థానిక గొట్టిపాడు రోడ్డులోని చర్చి, రావిపాటివారిపాలెం, పెదగొట్టిపాడు ఎస్సీ కాలనీలోని చర్చి, చినకోండ్రుపాడులోని పలు చర్చిలు, ప్రార్థనా మందిరాలు విద్యుత్ కాంతులతో విరాజిల్లుతున్నాయి. క్రీస్తు జననాన్ని కళ్లకు కట్టేలా ఆయా చర్చిల వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కుటీరాలు, పశువుల పాకల అలంకరణలు అందులో ఉంచిన క్రీస్తు ప్రతిమలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇప్పటికే బంధు, మిత్రుల రాకతో క్రైస్తవుల లోగిళ్లు కళకళలాడుతున్నాయి. ఆనందోత్సాహాల నడుమ నేడు పండుగను జరుపుకునేందుకు సర్వం సిద్ధం చేసుకున్నారు. ప్రేమ, కరుణ, శాంతి, దయ..వంటి సందేశాలతో క్రీస్తు లోకానికి నూతన మార్గాన్ని నిర్దేశించారని వాక్యోపదేశకులు విశ్వాసులకు బోధిస్తున్నారు.



చేబ్రోలు ప్రాంతంలో విద్యుత్ అలంకరణలో చర్చి



ప్రత్తిపాడులోని చర్చిలో విశ్వాసులకు క్రిస్మస్ సందేశం అందిస్తున్న రెవరెండ్ బెంజిమెన్

క్రిస్మస్ సందడి

చేబ్రోలు: క్రిస్మస్ సందడి ప్రారంభమైంది. మండల కేంద్రమైన చేబ్రోలుతో పాటు వివిధ గ్రామాల్లో మంగళవారం పండుగ సందడి కనిపించింది. రెండు రోజులుగా వర్షం కురుస్తున్నప్పటికి క్రిస్మస్ వేడుకలు జరుపుకోవటానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసుకున్నారు. పండుగ సందర్భంగా అలంకరణకు మార్కెట్లో రంగురంగుల స్టార్స్ వివిధ సైజులను కొనుగోలు చేసి చర్చిలు, ఇళ్లు, వీధుల్లో అలంకరిస్తున్నారు. వీటితో పాటు క్రిస్మస్ ట్రీలు, శాంతాక్లాజ్, క్రిస్మస్ స్టార్‌ల వెలుగులతో చర్చిలు, ఇళ్లు శోభయామానంగా తయారైనాయి. చేబ్రోలు, పాతరెడ్డిపాలెం, కొత్తరెడ్డిపాలెం, నారాకోడూరు, సుద్దపల్లి, వడ్లమూడి, శేకూరు, శలపాడు, గొడవర్రు, వేజండ్ల తదితర గ్రామాల్లోని ప్రధానమైన చర్చిలకు ప్రత్యేకంగా రంగులు వేసి, విద్యుత్ దీపాలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు.

27న వైఎస్సార్ సీపీ పోరుబాట



పోస్టర్ ఆవిష్కరించిన అంబటి మురళీకృష్ణ

- విద్యుత్ చార్జీలపెంపుకు వ్యతిరేకంగా నిరసన
- పార్టీసమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: విద్యుత్ చార్జీల పెంపుతో ప్రజలపై అధిక భారాన్ని మోపుతున్న కూటమి ప్రభుత్వం వైఖరిని నిరసిస్తూ వైఎస్సార్ సీపీ పిలుపు మేరకు వైఎస్సార్ సీపీ పోరుబాట పేరుతో ఈనెల 27న పొన్నూరు పట్టణంలోని విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పార్టీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పోరుబాట పోస్టర్‌ను నాయకులతో కలసి ఆవిష్కరించారు. మురళీకృష్ణ మాట్లాడుతూ చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ప్రజలపై అన్ని విధాలుగా మోయలేని భారం మోపుతోందని విమర్శించారు. అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రజలపై బాదుడు కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికలకు ముందు ప్రజలకు చంద్రబాబు అనేక హామీలిచ్చారని, అందులో భాగంగా తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీల పెంపుదల ఉండదని ప్రజలను నమ్మించారని గుర్తు చేశారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన ఆరునెలలలోనే ప్రజలపై రూ.వేల కోట్ల భారాన్ని మోపుతున్నారని మండిపడ్డారు. నేడు రాష్ట్రంలో చంద్రబాబు పాలనలో విద్యుత్ చార్జీల భారాన్ని మోయలేక ప్రజల నడ్డి విరుగుతోందని చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రజలకు అండగా వైఎస్సార్ సీపీ తలపెట్టిన నిరసన కార్యక్రమానికి అన్ని వర్గాల ప్రజలు మద్దతు తెలపడంతో పాటు పెద్ద ఎత్తున నిర్వహించే పోరుబాట కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ భవనం పద్మలీల, వైఎస్సార్ సీపీ నాయకులు ఆకుల వెంకటేశ్వరరావు, షేక్. నాజర్, బొనిగల వేణుప్రసాద్, అంబటి వెంకటేశ్వరరావు, వట్టిప్రోలు రంగారావు, రామ్మోహన్, కె.సుశోభిత, దేవరకొండ గోపి, మూర్తిరాజు, ఎందేటి వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

పోరుబాట పోస్టర్ ఆవిష్కరణ..

గుంటూరు రూరల్: కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల పెంపుదలను నిరసిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో కరెంట్ చార్జీల బాదుడుపై పోరుబాట పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఏటుకూరు గ్రామంలోని నియోజకవర్గం కార్యాలయంలో నాయకులు పోస్టర్ ఆవిష్కరించారు. ఈనెల 27వ తేదీన కరెంట్ చార్జీల బాదుడుపై పోరుబాట నిరసన కార్యక్రమం జరుగుతుందని కార్యక్రమంలో నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్త, నాయకుడు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ప్రత్తిపాడు వెలుగు కార్యాలయంలో విచారణ



ప్రత్తిపాడు వెలుగు కార్యాలయంలో విచారణ చేస్తున్న ఐబీ డీపీఎం కామేశ్వరి

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు వెలుగు కార్యాలయంలో డీఆర్‌డీఏ ఉన్నతాధికారులు విచారణ నిర్వహించారు. గొట్టిపాడులోని రాధాకృష్ణ గ్రామైఖ్య సంఘం వీఓఏను సభ్యులు, ఓబీ సభ్యులకు తెలియకుండా తొలగించి, కొత్త వారిని వీఓఏగా అక్రమంగా నియమించారని, అదేవిధంగా ఇదే గ్రామంలో మరో వీఓఏ అవినీతికి పాల్పడిందంటూ గొట్టిపాడు గ్రామానికి చెందిన డ్వాక్రా మహిళలు కొద్ది రోజుల కిందట జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో డీఆర్‌డీఏ పీడీ ఆదేశాల మేరకు డీఆర్‌డీఏ ఐబీ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కామేశ్వరి, పొన్నూరు ఏపీఎం జోయబాబు మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో విచారణ నిర్వహించారు. వీఓఏ నియామకానికి సంబంధించిన తీర్మానాలు, సభ్యుల సంతకాలు, వీవోఏ అవినీతికి సంబంధించిన పలు వివరాలను స్థానిక అధికారులను అడిగి తెలుసుకోవడంతో పాటు తీర్మానం పుస్తకాలను పరిశీలించారు. వెంట ఏపీఎం వి.లాజరు ఉన్నారు.

రైతులు పంటల బీమా చేయించుకోవాలి



గొట్టిపాడులో పంట పొలాలను పరిశీలిస్తున్న ఏఓ అరుణకుమారి

ప్రత్తిపాడు: రైతులు పంటల బీమాను త్వరితగతిన చేయించుకోవాలని ఏఓ కె.అరుణకుమారి కోరారు. మండల పరిధిలోని పెదగొట్టిపాడు, గనికపూడి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంట పొలాలను పరిశీలించారు. అనంతరం స్థానిక సచివాలయాల్లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఏఓ మాట్లాడుతూ రైతులు ఈ నెల 31వ తేదీలోగా బీమా చేయించుకోవాలని చెప్పారు. లేదంటే నెలాఖరుతో గడువు ముగుస్తుందని తెలిపారు. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకునే రైతులకు బ్యాంకర్లే రైతుల అనుమతితో బీమా ప్రీమియంను మినహాయించుకుంటారని తెలిపారు. రుణాలు తీసుకోని రైతులు ఆయా గ్రామాల్లోని డిజిటల్ అసిస్టెంట్లు, కామన్ సర్వీస్ సెంటర్లు ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. అదే విధంగా ఈక్రాప్ బుకింగ్‌ను ప్రతి రైతు తప్పకుండా చేయించుకోవాలని కోరారు. శనగ పంటను ఆలస్యంగా సాగు చేసుకోవాలనుకునే రైతులు విత్తనాల శాతాన్ని ఐదు నుంచి పది శాతం పెంచి విత్తుకోవడం వలన దిగుబడులు తగ్గకుండా ఉంటాయని వివరించారు. వెంట వెటర్నరీ డాక్టర్ నందకిషోర్, వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రతివారు ప్రేమ తత్వాన్ని, క్షమాగుణాన్ని అలవర్చుకోవాలి



సెమీ క్రిస్మస్ వేడుకల్లో చేతన యాజమాన్యం

గుంటూరు రూరల్: ప్రతివారు ప్రేమ తత్వాన్ని, క్షమాగుణాన్ని అలవర్చుకోవాలని బాలకుటీర్ వ్యవస్థాపకురాలు డాక్టర్ ఎస్.మంగాదేవి తెలిపారు. మంగళవారం చౌడవరంలోని శ్రీవెంకటేశ్వర బాలకుటీర్ చేతనాలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రేమ, దయ, సహనం, శాంతి కలిగి ఉండాలని ప్రపంచానికి చాటి చెప్పిన మహోన్నతుడు ఏసుక్రీస్తు అని తెలిపారు. ఆయన బోధనలు ఈనాటి సమాజానికి ఎంతో అవసరమన్నారు. చేతనా కార్యనిర్వాహకురాలు మరుద్వతి మాట్లాడుతూ సమాజంలోని వ్యక్తులంతా పరస్పరం గౌరవించుకుంటూ ప్రేమాదరాభిమానాలను పంచుకున్నప్పుడు శాంతి విలసిల్లుతుందని చెప్పారు. అనంతరం క్రీస్తు జననం నాటికలు, నృత్యాలను విద్యార్థులు ప్రదర్శించారు. జింగిల్ బెల్ జింగిల్ బెల్ అంటూ సాగే శాంతాక్లాజ్ నృత్యం అందరిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో సీఏవో దుర్గారఘురామ్, ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎండీ నస్రీన్, లక్ష్మీప్రసన్న, మల్లికార్జునరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చిల్డ్రన్స్ హోమ్‌లో సెమీ క్రిస్మస్



నారాకోడూరు చిల్డ్రన్స్ హోమ్‌లో సెమీ క్రిస్మస్ వేడుకల్లో భారతి సిమెంటు ప్రతినిధులు

చేబ్రోలు: ఏసుక్రీస్తు బోధనలు అందరికీ మార్గదర్శమని భారతి సిమెంటు కంపెనీ అసిస్టెంట్ మేనేజర్ పి.సురేష్ అన్నారు. మండలం నారాకోడూరులోని చిల్డ్రన్స్ మినిస్ట్రీస్ హోమ్‌లో భారతి సిమెంటు కంపెనీ ప్రతినిధుల ఆధ్వర్యంలో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అసిస్టెంట్ మేనేజర్ సురేష్ మాట్లాడుతూ సత్యం, ధర్మం, శాంతి, సహనంను ఏసుక్రీస్తు ప్రపంచానికి అందించారన్నారు. క్రీస్తుమార్గం అందరికీ ఆచరణనీయమన్నారు. విద్యార్థులు చిన్నతనంలోనే ఒక లక్ష్యాన్ని ఏర్పరుచుకొని వాటి సాధన కోసం కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా చిల్డ్రన్స్ హోమ్‌లోని చిన్నారులతో కలసి క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. హోమ్‌లోని పిల్లలకు కేక్, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ టెక్నికల్ ఎన్.భవానీ శంకర్, స్థానిక కంపెనీ డీలర్ శ్రీనివాసరెడ్డి, చిల్డ్రన్స్ హోమ్స్ ఏరియా మేనేజర్ కే రమేష్ పాల్గొన్నారు.

కళ్లం కళాశాలలో ఉచిత వైద్య శిబిరం

గుంటూరు రూరల్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని కళ్లం ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం చౌడవరంలోని కళాశాలలో విద్యార్థులకు, ఉపాధ్యాయ సిబ్బందికి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డైరెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, మంచి ఆహారం తీసుకుని, అనారోగ్య సమస్యలు వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో కొనాక్ డయాగ్నస్టిక్ ఇన్‌చార్జి టి.సాయిబాబు, వైద్యులు విద్యార్థులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రొఫెసర్ డి.శ్రీనివాసరెడ్డి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ పీఎల్ మాధవరావు, పీడీ పి.పున్నారెడ్డి పాల్గొన్నారు.